# యద్దనపూడి సులోచనారాణి

# అనురాగతోరణం



ప్రియమైన శ్రీవారికి,

లక్ష్మి నమస్కరించి వ్రాయునది ! నేను రాత్రంతా బాగా ఆలోచించాను ! ఒక్కసారి మన పెళ్ళిఅయిన యీ పది సంవత్సరాల నుంచి, మనం గడిపిన జీవితం, యీ సంసారంలో నేను పొందిన సుఖం, ఆనందం ఏమిటో, యిందులో నేను పడిన శ్రమ ఏమిటో, కూలంకషంగా నాలో నేనే తర్కించుకుని, చర్చించుకున్నాను ! కానీ డబ్బు సంపాయించటం నాకు చాతకాని మాట నిజమే ! కానీ, నా శరీర శక్తితో, మీ సంపాదనలో ఎంత భాగం కూడ బెట్టేట్టు చేయగలిగానో, నా ఒక్కదానికే తెలుసు. అది మీకు గుర్తుచేయటం, నన్ను నేనే కించపరచుకొనటం అని భావిస్తున్నాను ! 'పనీ పాటా లేకుండా కూర్చుని తింటూనే నీకు కష్టం తెలియటం లేదు' అని మీరు మాటిమాటికీ విసుక్కుంటుంటే విని భరించటం, నన్ను కాదని వూరుకోవటం నాకు శక్తికి మించినపని అవుతోంది ! పనీ పాటా లేకుండా, వూరికే కూర్చుని, మీరు ఎంతో కష్టపడి ఆర్జించిన సొమ్ముని నష్టపరుస్తున్నాననే బాధ మీకు వద్దు ! మీరు రోజుకి కనీసం ఒకటి రెండుసార్లయినా 'పుట్టింటికి పో !' అని కసరటం కూడా

నేను సహించలేకుండా వున్నాను ! నా పుట్టింటివారికి నన్ను భరించేశక్తి లేదని, మా అన్నయ్య చాలా అప్పుల్లో వుండి నానా బాధలూ పడుతున్నాడని మీకు తెలుసు ! తెలిసి కూడా నన్నిలా, ఎందుకిలా కించపరుస్తున్నారో నాకు అర్థం గావటంలేదు ! యీ యింట్లో భార్యగా నా గౌరవం నాకు లేనప్పుడు, నేను వుండటమే అనవసరం అనిపిస్తోంది ! కాబట్టి వెళ్తున్నాను ! మీ యింటిని, మీ పిల్లల్ని మీకు అప్పచెప్పి వెళ్తున్నాను. మీరు నా చేతికి మొదటి తేదీన యిచ్చిన జీతంలో, నూటయాభై రూపాయిలు మిగిలినాయి ! అవి బీరువాలో ఎఱ్ఱపూసల పర్సులో వున్నాయి ! ఇన్నాళ్ళనుంచి, మీ పోషణలో బ్రతుకుతూ, మిమ్మల్ని ఏమాత్రం సుఖపెట్ట లేకపోతున్నందుకు నాకు చాలా సిగ్గుగా వుంది. నా అశక్తతని నన్ను మన్నించండి !

సెలవ్

లక్ష్మి.

ఈ వుత్తరం చదవగానే వివేకానందకి ఒళ్ళు మండిపోయింది !

పళ్ళు పటపటలాడినాయి.

స్టుపిడ్ ! రాస్కెల్ ! ఇడియట్ ! తలనొప్పితో భస్సూ, యింటికి వస్తే, యీవిడకి ఈ రోజే వెళ్ళిపోవటానికి తీరుబడి అయింది కాబోలు

పనీ పాటా లేకపోతే, బుద్ధి యిలాగే వెఱ్ఱితలలు వేస్తూ వుంటుంది ! చచ్చి చెడి, ఆఫీసులో నానా వత్తిడిలకి గురి అయి, వేదన అంతా భరించి, జీతం తెచ్చి ఆవిడ చేతిలోపోస్తే, తినికూర్చుని యిట్లా ఆలోచించకపోతే యింకేం చేస్తుంది! ఒక్కరూపాయి, బయటికి వెళ్ళి సంపాయిస్తే తెలుస్తుంది !

ఆ వుత్తరం కసిగా ముక్కలు ముక్కలు చేసి క్రిందవేసి, నలిపి, బూటుకాలుతో, అవతలకి తోసాడు.

వెళుతుంది ! వెళుతుంది ! అహానికి, ఏం లోటులేదు ! ఆత్మాభిమానం ! బోడి అభిమానం! తనకేవుంది ఆత్మాభిమానం ఏనుగంత ! కానీ ఎవరు వెల్లబోస్తారు ! ఆఫీసులో ఆఫీసరుముందు నుంచుంటే, ఆ ఏనుగంత అభిమానం చీమంత అయిపోతుంది !

వివేకానందమూర్తి ఫ్లాస్కు తీసుకుని రోడ్డుకి చివరనున్న హోటల్‌కు వెళ్ళి కాఫీ తెచ్చుకున్నాడు.

అతను గ్లాసులో పోసుకుని తాగుతుండగా ఆటలకి వెళ్లిన పిల్లలు పరుగెత్తుకు వచ్చారు.

"నాన్నా ! అమ్మ ఎక్కడ ?"

"వూరు వెళ్ళింది."

"వూరా ! ఏవూరు ! మాకు చెప్ప లేదేం ?" రవి బిక్కముఖం వేసాడు.

"నన్ను తీసుకువెళ్ళలేదు. ఊ-ఊ" మాధవి రాగం లంకించుకుంది.

వివేకానంద కూతురి వీపుమీద ఒక్కటి చరిచాడు.

"వెధవగోల చేయకుండా వెళ్ళి అన్నం పెట్టుకుని తిని పడుకోండి."

"పొండి."

మాధవి ఏడుపు టక్కున మింగేసింది !

"రా! అన్నం తిందాం." రవి చెల్లెలి చేయి పట్టుకుని లాక్కెళ్ళుతూ అక్కడనుంచి పారిపోయాడు.

"పిల్లల్ని వదిలిపెట్టి వెళుతోందట ! బోడి తెలివితేటలు! పనిపాటా లేకుండా పుస్తకాలు చదివి ! వెధవ పుస్తకాలు ! అసలు యీ రోజుల్లో పనిపాటా చేసుకుంటూ లక్షణంగా వుండే ఆడాళ్ళని మతులు చెడగొట్టి, వెఱ్ఱివేషాలు నేర్పేది యీ పుస్తకాలే ! తా చెడ్డకోతి వనమల్లా చెరిచిందని, ఒంటినిండా పనిలేని మహా తల్లులు వుబుసుపోక ఏదేదో వ్రాస్తే, వీళ్ళు అది చదివి వూరుకోకుండా, తల నిండా పైత్యం ఎక్కించుకుని, అసంతృప్తులు రగిలించుకోవటం ! ఇప్పుడు యీవిడకి ఏం తక్కువ అని ! లక్షణంగా భోజనం, టిఫిన్లు కాఫీ, పైనుంచి యీ పుస్తకాలు ! వారానికో సినిమా ! పైనుంచి అల్లికలంటూ, ఆ వైరు బాగులకి అదో ఖర్చు. యీ పెట్టినదంతా పోయింది! ఏదో చిరాకులో విసుక్కుంటే, యీవిడగారి అభిమానం ! సింగినాదంట! వెళ్ళమను ఆ అభిమానం అన్నంపెడుతుంది! సినిమాలు చూపిస్తుంది ! పండగకి కొత్త చీరెలు కొనిస్తుంది ! నెల రోజులు ఖర్త అనేవాడు కంటికి కనిపించకుండా వుంటే తెలుస్తుంది ! పనీపాటా లేకపోతే సరి !

వివేకానంద వెంటనే కూర్చుని బావమరిదికి ఒక వుత్తరం వ్రాసేసాడు.

పాండురంగానికి,

మీ చెల్లెలు నాతో చెప్పకుండా నీ దగ్గరకి వచ్చేసింది ! ఈ అవమానం నేను సహించలేను ! నాతో చెప్పకుండా వెళ్ళింది కాబట్టి, యిక నా యింటిలో మళ్ళీ అడుగుపెట్టటానికి వీల్లేదు అన్నానని చెప్పు ! నేను డైవర్స్‌కి అప్లై చేస్తున్నాను ! నా పిల్లలు నేను క్షేమం !

ఇట్లు

వివేకానంద.

ఆ వుత్తరం వ్రాసి అతను బట్టలు మార్చుకున్నాడు. తలనొప్పిగా వుండటంవల్ల ఆకలి వేయలేదు ! రేపు ఆఫీసులో ఇనస్పెక్షన్ వుంది ఉదయం త్వరగా లేవాలి ! అతను అరచేత్తో గడ్డం రాచుకున్నాడు. ఈ వెధవ గడ్డం ఒకటి. ఒక్కరోజు చేసుకోకపోతే ముఖాన్ని బూచాడులా మారుస్తుంది ! వెధవగోల ! వెధవ సంత! ఆ ఆఫీసరో క్రాక్! అందరూ అందరే తన ప్రాణానికి! ఒక్కళ్ళయినా సరైనవాళ్లు దొరకలేదు!

ఈవిడగారు వెళితే యిక్కడ తన జీవితం ఏమీ ఆగిపోదు ! పనిమనిషి

ఎలాగూ వుండ ! భోజనానికి హోటలు వుంది ! తనకేం ! ఆవిడే గడ్డితిని మళ్ళీ ఏడుస్తూ వుత్తరాలు వ్రాస్తుంది.

వివేకానందకి ఆరాత్రి ఒకటే కలలు! ఒకపక్క లక్ష్మి ఏడుపు! ఏదో వెళ్ళాను కదా అని, నన్ను అసలు యింటికి రానీయకుండా చేస్తారా ! యింకెప్పుడు యిలాటి తప్పుచేయను !

"నోరు మూసుకునిపో! నా గుమ్మం ఎక్కకు" అంటున్నాడు తను.

"ఏమయ్యా వివేకానందం! మీ భార్యా భర్తల పోట్లాటలు తర్వాత ! ముందు ఆ ఫైల్ యిలా యివ్వు ! సంతకాలు పెట్టాలి." ఆఫీసరు అరుస్తున్నాడు.

"వస్తున్నా సర్!" ఎంత వినయంగా అన్నాడు.

"నన్నేం చేయమంటారు;" యిదే సందు అని అడుగుతోంది లక్ష్మి.

"నోరు మూసుకుని పో!" తను ఆఫీసర్ లాగనే అరుస్తున్నాడు.

"ఏమిటయ్యా వస్తున్నావా లేదా" ఆఫీసర్ గావుకేక

"వస్తున్నా సర్" మళ్ళీ వినయంగా జవాబు.

"నాన్నా, నాన్నా" పిల్లలు పరుగెత్తుకు వచ్చారు.


"నువ్వేమిటయ్యా! సంసారం అంతా ఆఫీసుకి రప్పించావు ! ఏమిటి యీ న్యూసెన్స్ ఆ?" ఆఫీసర్ గద్దించాడు.

"మాధవీ ! రవీ ! మీరు యింటికి పొండి."

"మేం వెళ్ళం. చాకలెట్లు కొనిస్తేనే వెళ్తాం."

వాళ్ళ మొండితనానికి ఒళ్ళ మండి పోయింది ! గట్టిగా అరిస్తే, ఆఫీసరు తిడతాడేమోనని భయం !

కలతనిద్రతో, విద్రలో కూడా ఆవేశంతో, ఆగ్రహంతో వుక్కిరి బిక్కిరి అయిన వివేకానంద లేచి కూర్చున్నారు !




తెల్లవారు ఝామున మూడుగంట లయింది ! రాత్రి భోజనంలేకపోవటంతో తలనొప్పి యింకా ఎక్కువైంది ! మళ్ళీ నిద్ర రాలేదు !

అలాగే పడుకున్నాడు !

తెల్లవారింది !

పనిమనిషి వచ్చింది !

హోటల్‌కి పంపించి కాఫీ, టిఫిన్ తెప్పించాడు.

"అమ్మగారు నాకు చెప్పకుండా వూరెళ్ళారేంటి ? ఎప్పుడు వస్తారు మళ్ళీ."

"నాకు తెలియదు. చూడు నీకు పాతిక రూపాయలు ఎక్కువ యిస్తాను. పిల్లలకి నీళ్ళు, ప్రొద్దుట భోజనం అంతా చూడు" అన్నాడు.

"అట్లాగేనయ్యా అట్లాగే" పనిమనిషి ఎంతో సంబరంగా అంది పనిమనిషి ముఖంలో ఆనందం చూసేసరికి, వివేకానందకి గర్వంతో ఛాతీ పైకి వచ్చింది,

"కాని! డబ్బు పారేస్తే మనుష్యులకేం కొదవ" అనుకున్నాడు.

పనిమనిషి చకచకా పనంతా చేసేసింది.

పిల్లలు స్కూలుకి వెళ్ళిపోయారు.

వివేకానంద హోటల్లో భోజనంచేసి ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

మూడు రోజులు గడిచినాయి.

వివేకానందకి ఆఫీసు ఇనస్పెక్షన్ గొడవలో టైమ్ తెలియడం లేదు. ఆ పూటే ఇన్‌స్పెక్షన్ ముగిసింది !

అతనికి అమ్మయ్య అనిపించింది !

అతను యింటికివచ్చేసరికి, బావమరిది వచ్చి వున్నాడు.

అతన్నిచూస్తేనే వివేకానందకి చిరాకు పుట్టుకువచ్చింది.

"ఆ బట్టలేమిటి ? ఆ మాసిన గడ్డం ఏమిటి ? కాస్త నీట్‌గా రాకూడదూ !"

ఆయన వివేకానందని చూస్తూనే మొదలెట్టాడు.

ఇదుగో ఆనందూ! లక్ష్మి నా దగ్గరకి వచ్చిందని వ్రాసావు.

అది రానేలేదు. ఎక్కడికి వెళ్ళింది ? ఏమైందసలు ?"

అసలే నీరసంగా, అలసటగా వున్న వివేకానందకి ఆయన గాభరా చిరాకు పుట్టించింది.

"అనవసరంగా నాటకాలు ఆడకండి. నా దగ్గరేం సాగవు మీ దగ్గరకి రాకపోతే ఎక్కడకి వెళుతుంది ?"

"అదే నాకూ తెలియలేదు ! అసలేమైంది !"

"ఏమీ కాలేదు ! మీ చెల్లెలుగారికి పనీపాటా లేక, బుఱ్ఱలో వేపకాయఅంత వెఱ్ఱిపుట్టింది ! మీ దగ్గరకి వస్తున్నా

నని వ్రాసింది ! నా గడప దాటిం తర్వాత, ఏమైనా నా కనవసరం !"

పాండురంగం, వివేకానందం చొక్కా పట్టుకున్నాడు.

"ఏమిట్రా వాగుతున్నావు ! పెళ్ళి చేసుకుని, పది సంవత్సరాలు కాపురం చేసి, ఇద్దరు పిల్లల తల్లి అయిన భార్య గురించి, నీకేం పట్టలేదా ! అయితే, నువ్వే దాన్ని ఏదో చేసివుంటావు ! ఏమీ ఎరగని నంగనాచిలా, నాకిలా వుత్తరం వ్రాసివుంటావు !

అప్పటికే వివేకానంద అతన్ని బలవంతంగా వదిలించుకున్నాడు.

"అనవసరమైన వాగుడు వాగొద్దు ! ఇక్కడ నుంచి వెళ్ళు !"

"నా చెల్లెలు ఏమైందీ చెప్పు !"

"నాకు తెలియదు అంటే వినవేం !"

"అంత తెలియకుండా ఏం చేస్తున్నావు ?"

"ఏమటండీ వివేకానందంగారూ ! ఏమైంది ?" పక్కింటాయన వచ్చాడు.

వివేకానందం నోరు తెరవకముందే ఆయనకి ఎదురెళ్ళి పాండురంగం చేతులు తిప్పుతూ అంతా చెప్పేసాడు. పక్కింటాయన అయన వెనకే భార్యా పిల్లలు వచ్చారు. వీళ్ళు రావటంతో, ఎదురింటి వాళ్ళు వాకిట్లోకి వచ్చి నిలబడి చూస్తున్నారు.

వివేకానందంకి పొడుచుకు చావాలన్నంత అవమానం అనిపించింది !

క్షణంలో, లక్ష్మి ఎక్కడకో వెళ్ళిపోయిందనే వార్త గుప్పుమంది. "అయ్యో ? మాకు తెలియనే తెలియదు. అంటూ కళ్ళు బుగ్గలు నొక్కుకున్నారు.

"వీడు మనిషా పశువా అండీ ! పిల్ల వెళ్ళిపోయిందంటే నాకు అనవసరం అంటాడు." పాండురంగం అరుస్తున్నాడు.

"వూరికే మాటలు విసురకోకండి ! అసలు ఏమైంది ? ఏమైనా తగాదా పడ్డారా !"

"ఏమంత తగాదా పడలేదు ! తనే ఒళ్ళుబలిసి వెళ్ళిపోయింది.

"అదుగో చూసారా" పాండురంగం, తాడు తెంచుకోబోయిన పోట్లగిత్తలా చూసాడు.

"లక్ష్మి అసలు ఎప్పుడు వెళ్ళింది ? ఇంట్లో ఎంత డబ్బు తీసుకు వెళ్ళింది. !" అనే చర్చలు ఆరా ప్రారంభమైనాయి !

కట్టుబట్టలతో వెళ్ళింది !

బీరువాలోనుంచి ఒక్క రూపాయి కూడా తీసుకువెళ్ళలేదు.

"అంటే - అంటే - ఏ రైలు క్రిందనో పడివుంటుంది !"

పాండురంగం బావురుమన్నాడు.

"ఏమోనండీ ! నిన్ననే సికిందరాబాద్‌లో రైలుక్రిందపడి యువతి దుర్మరణం అనే వార్త వుంది ! ఎవరో తెలియలేదట !" పక్కింటావిడ పరుగెత్తుకెళ్ళి పేపరు పట్టుకువచ్చింది !

హాస్పిటల్‌కి వెళ్ళి కనుక్కుందాం పదండి ! ఎందుకైనా మంచిది. పోలీసు రిపోర్ట్ కూడా యిస్తే నయం !" పక్కింటాయన పెద్దరికం నెత్తిన వేసుకుని సలహాయిచ్చాడు.

పాండురంగం ఆయనతో వెళ్ళబోతూ ఎర్రబడిన కళ్ళ అన్నాడు. "ఒరేయ్ ! నా చెల్లెలికి ఏమైనా అయిందా — నిన్ను చంపి నీ రక్తం తాగుతాను ! జాగ్రత్త !" అంటూ ప్రతినచేసి వెళ్ళాడు !

వివేకానంద లోపలికి వచ్చాడు !

అతనికి ఆగ్రహం తగ్గిపోయింది !

పడక్కుర్చీలో వుస్సురంటూ కూర్చున్నాడు.

ఈ ఆఫీసు ఇనస్పెక్షన్ పుణ్యమా అని, మూడు రోజులనుంచీ నిద్రాహారాలు లేవు ! హోటల్ భోజనం పడక కడుపంతా ఎలాగో ఉంది !

దాని పైన యీ గలాటా !

అతనికి లక్ష్మి పుట్టింటికి వెళ్లలేదంటే చాలా ఆశ్చర్యంగా వుంది !

ఇంకెక్కడికి వెళ్ళి ఉంటుంది.

"నాన్నా ! అమ్మ ఏమైంది ?" ఊహ తెలిసిన పిల్లలు ఏడుపు లంకించుకున్నారు.

"మీరు ఏడ్చారా తంతాను !" అన్నాడు.

పిల్లలు అక్కడినుంచి దొడ్లోకి వెళ్ళి ఏడవసాగారు. పక్కింటావిడ వాళ్ళని తన యింట్లోకి తీసుకువెళ్ళింది. పనిమనిషికి జ్వరం వచ్చిందట ! నిన్నటినుంచి రావడంలేదు !

అతని తల బ్రద్దలయిపోతోంది !

అన్నీ సమస్యలే ! అడుగడుగునా బాధలే !

సాయంత్రం అయింది !

లక్ష్మి జాడ తెలియలేదు !

అతిధులు వచ్చారు ! పరామర్శలు జరిగినాయి !

ఏదేదో అంటున్నారు ! అతనికి అవి వినే ఓపిక కూడా లేదు !

రెండు రోజులు గడిచాయి !

వివేకానందం ఆఫీసులో తలెత్తుకోలేక శలవు పెట్టేసాడు.

అతని ఆవేశం తగ్గిపోయింది !

లక్ష్మి ఏమైంది ?

అసలు తను ఏమన్నాడని ? ఏం అవమానం చేసాడని ? విసుక్కున్నదే కన్పించింది కాని, తనకి తెచ్చిన చీరలు, చూపించిన సినిమాలు, చేయించిన నగలు ! యివన్నీ !

అవన్నీ తనకి అవసరం లేనట్టు వదిలేసి వెళ్ళిందిగా !

వాటికంటే యింకేం కావాలి !

మరో రెండు రోజులు గడిచినాయి !

పాండురంగం ఆఫీసుకి వెళ్ళి ఆఫీసరుకి కూడా చెప్పేసాడు.

అతనికి ఆఫీసులో వున్న మంచి పేరంతా, యీ రూపేణా మట్టిలో కలిసింది! అందరూ అతన్ని చూపులతో చీల్చేస్తున్నారు ! సూటిపోటి మాటలతో చంపేస్తున్నారు !

అతను యింట్లో వుండలేక పోతున్నాడు !

బైటకి అసలు వెళ్ళలేకపోతున్నాడు!

ఏం చేసాడు తను ? ఏం అపరాధం చేసాడు ?

భార్యని సరిగ్గా చూడలేదా ?

ఆ మాట ఎవరైనా అంటే పళ్ళు రాలగొడతాడు !

పాండురంగం పిల్లల్ని తనవెంట తీసుకువెళ్తా నన్నాడు.

"పంపించను," అన్నాడు.

"ఎందుకూ ? వాళ్ళని కూడా మాయం చేయించటానికా ?"

"నా ఇష్టం వచ్చినట్టు చేసుకుంటాను! వాళ్ళు నా పిల్లలు ! అడగటానికి నువ్వెవరు ?" రెచ్చిపోతూ అన్నాడు.

నువ్వు గోముఖవ్యాఘ్రానివి ! పైకి పెద్దమనిషివి ! తడిగుడ్డతో గొంతులు కోసే రకానివి అని ప్రపంచానికి తెలియదు !"

"ఇంకో నిముషం నా కళ్ళెదుట వుంటే - నిన్ను చంపుతాను ముందు." వివేకానంద అరిచాడు.

"చంపుతావు, చంపుతావు. నీ ఉద్యోగం వూడగొట్టించి, నిన్ను జైలులో తోయించి, ఆ పిల్లలను తీసుకు వెళ్ళకపోతే చూడు", పాండురంగం అంగలేస్తూ వెళ్ళిపోయాడు

పనిమనిషి రానని కబురుచేసింది.

ఇల్లంతా అడవిలా ఉంది !

అతనికి పిచ్చాసుపత్రిలో వున్నట్టుగా వుంది !

పగలంతా అతనికి కోపంతో, ఆవేశంతో గడిచిపోతున్నా, రాత్రిపూట లక్ష్మి గుర్తుకువస్తే ఏడుపు వస్తోంది !

ఏం తప్పుచేసాడు తను ! అతనికి అర్థం కావటంలేదు !

యింకా యింకా కోపం వస్తోంది !

మర్నాడు - పక్కింటాయనతో పాండురంగం కబురుచేసాడు. లక్ష్మి యీ ఊళ్ళోనే వుందిట !

లాయరు జయలక్ష్మిగారింట్లో వుందిట!

డైవర్స్ తీసుకోవటానికి సిద్ధంగా వుందిట !

లాయరుగారి యింటికి వస్తే, ఆ మాట నాతో మాట్లాడి రభస లేకుండా విడాకుల ప్రయత్నం చేసుకోవచ్చుట !

వివేకానందకి మనసు భగ్గుమంది !

"నే నెక్కడికీ రాను ! కావాల్సిన కాగితాలు పంపిస్తే సంతకం చేస్తాను."

తనుకూడా లాయరుని సంప్రదించాడు.

ఆ లాయరు అతనికి మిత్రుడు; అంతా విని, "నీకేమైనా పిచ్చా !" అన్నాడు.

"నాకు కాదు; ఆవిడకి ! నేను సంపాయిస్తుంటే పనీపాటా లేకుండా తిని కూర్చుని, చేసిన పని ఇది !"

"మీరిద్దరూ ఒకసారి మాట్లాడండి!"

"నాకు అవసరం లేదు !"

"ఆవిడ మాట్లాడతానంటే–"

"నాకు అభ్యంతరంలేదు ! కానీ నేనెక్కడికీ రాను ! ఆవిడే నా దగ్గరికి రావాలి !"

"సరే మీ యింటికి వచ్చే ఏర్పాటు చేస్తాను."

"సరే!" వివేకానంద వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం లాయరు వచ్చాడు.

"ఆనందూ ! ఆవిడ ఇక్కడకి రాదుట !"

"ఏం !"

"నువ్వు తన గడప ఎక్కవద్దని అన్నగారికి వ్రాసిన ఉత్తరం చూసిందిట !"

ఆనందు కోపం రెట్టింపు అయింది.

"సరే !"

"మా యింటికి అయితే వస్తుందిట ! నువ్వు కూడా రా !"

"నేను రాను !"

"మొండిగా మాట్లాడకు ? విడాకులు అంటే తమాషా అనుకోకు ! నీ జీతంలో ఆవిడకి కొంత యివ్వాలి !"

"అలాగే పారేస్తాను ! బిచ్చగాళ్ళకి వేయడంలా ముష్టి !"

"ఆనందూ ! నువ్వింత పరుషంగా మాట్లాడితే ఎలా ?"

"నా బాధ మీకు తెలియదు లెండి!"

"నా స్నేహితుడిగా చెబుతున్నాను ! నా యీ ఒక్కమాట విను! సాయంత్రం రా ! ఆవిడని పిలిపిస్తాను ! ఆవిడకి నువ్వు ఏం తక్కువ చేసావో అడుగు ! ఆవిడ మాటల్లోంచి మనం మంచి పాయింట్లను లాక్కుందాం ! అది మనకి చాలా ఉపయోగం!"

"అట్లా అయితే వస్తాను."

"సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకి. మర్చిపోకు."

"మర్చిపోను."

సరిగ్గా ఆరుగంటలు కొడుతుండగా ఆనందు లాయరుగారి యింటికి వెళ్ళాడు.

లాయరుగారు ఒక్కరే కూర్చుని వున్నారు.

"కూర్చో ! ఆవిడ వచ్చింది. లోపల గదిలో వుంది, పంపిస్తాను."

ఆయన లేచి వెళ్ళాడు.

పది నిముషాలయింది !

ఈ పది నిముషాల్లో, ఆనందుకి లక్ష్మి వెళ్ళటం మూలంగా, యింట్లో, బయటా తను పొందిన అవమానాలు అన్నీ గుర్తుకు వచ్చినాయి !

అతని రక్తం వేడెక్కింది ! అది లావాలా కుతకుత లాడసాగింది. అతని

అతని శరీరం, మనసు, క్రోధపు పొగలు సెగలూ విరజిమ్ముతున్నాయి !

అతను బ్రద్దలవటానికి సిద్ధంగావున్న అగ్నిపర్వతంలా వున్నాడు !

అతను కుర్చీలో కూర్చోలేనట్టుగా, గదిలో లేచి పచార్లు ప్రారంభించాడు !

చీర రెపరెప వినిపించింది !

పాదాల అలికిడి అయింది !

అతను తిరిగి చూసాడు !

లక్ష్మి గదిలోకి వచ్చి నిలబడింది !

అతను ఆమెకి అభిముఖంగా వచ్చి నిలబడ్డాడు.

లాయరుగారు లక్ష్మిముందు ఆవేశపడ వద్దని, ఆగ్రహపడవద్దని, నేర్పుగా ఆమెతో తర్కానికి దిగి, ఆమెచేత వాగించమని, ఎన్నెన్నో పాఠాలు బోధించాడు !

కానీ యీ క్షణంలో లక్ష్మిని చూస్తుంటే, అవేవీ గుర్తురావడంలేదు !

ఆవేశంతో వుప్పొంగిపోతున్న అతని మనస్సు ఒక్కసారి గేట్లు బద్దలు చేసుకుని పొంగిన రిజర్వాయరులా ఛళ్ళున ముందుకు వురికింది !

తను పడిన అవస్థ అంతా గుర్తుకు వచ్చింది !

కళ్ళలో నిప్పులు రాలుస్తున్నట్లు చూసాడు !

పళ్ళు బిగబట్టాడు !

అతని కుడిచేతిలోకి అతని ఒంట్లో వున్న శక్తి అంతా వచ్చింది ! ఈడ్చి లక్ష్మి చెంపమీద ఎడాపెడా కొట్టాడు ! లక్ష్మి తూలినట్టుగా రెండడుగులు పక్కకి వెళ్ళింది. కళ్ళు గిర్రున తిరిగాయి. అక్కడున్న బీరువాని పట్టుకుని ఆపుకుంది !

మరుక్షణంలో దానికి ముఖం చేర్చి ఏడవసాగింది.

ఆ ఏడుపు హృదయ విదారకరంగా వుంది !

అతడు దగ్గరకి వెళ్ళాడు.

ఎడంచేత్తో లక్ష్మిజడని గుప్పెట నిండా పట్టుకుని తల బలవంతంగా వెనక్కి వంచేలా చేసాడు !

మరోసారి కొట్టటానికి చేయి ఎత్తాడు. కానీ లక్ష్మి ముఖం చూసేసరికి అతని చేయిలో శక్తి అంతా హరించుకుపోయి నట్టుగా అయింది !

వారంరోజుల్లో మనిషి యింత చిక్కిపోవడం ఎలా సాధ్యం ! చెంపల దగ్గర ఆ నునుపు అంతా ఏమై పోయింది ? ఏడుస్తున్న ఆ ముఖంలో అహం లేదు. అభిమానం లేదు ! చిన్న పిల్లలా వుంది ! లక్ష్మి అతని చేతినుంచి విడిపించుకోవాలని చూడలేదు! విడిలించు కోలేదు.

హఠాత్తుగా అతని ఆగ్రహం అంతా మంచుతెరలు విడిపోయినట్టుగా మాయ మైంది !

ఆ క్షణంలో అతను ఏంచేస్తున్నాడో అతనికే తెలియలేదు !

లక్ష్మిని అతని చేతులు దగ్గరకు లాక్కున్నాయి ! బలంగా గుండెలకి హత్తుకున్నాయి.

అతడేం మాట్లాడలేదు.

కారణం అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది ! అతని కనురెప్పలు నీళ్ళతో బరువెక్కినాయి !

తాను-"నేనేం తప్పు చేసానని యిలా వెళ్లిపోయావు !" ఎంతో ప్రయత్నం మీద గాద్గదికంగా అడిగాడు.

లక్ష్మి మాట్లాడలేదు !

అతన్ని కరుచుకుపోయినట్లుగా నిలబడింది !

"మాట్లాడవేం ? నేనేం తప్పుచేశాను? నీకేం లోటుచేసాను ? జీతం అంతా తెచ్చి నీ చేతిలో పెడుతున్నానే !

నేనేమన్నా తాగుబోతునా ! వ్యభిచారినా ! పేకాట ఆడతానా ! గుఱ్ఱపు పందేలకి వెళ్తున్నానా ? కనీసం సిగరెట్లు కూడా కాల్చనే ! మగాడికి ఇంతకంటే యింకేమైనా మంచి లక్షణాలు వున్నాయా ?"

లక్ష్మి లేవన్నట్టు తలవూపింది.

"మరి ఎందుకు వెళ్లావు ?"

"నన్ను మీరు పనీపాటా లేదని మాటిమాటికీ అంటారు. నేను యింట్లో పనిచేయడంలేదా ? ఒక్క క్షణం వూరికే వుంటానా ! నేను డబ్బు సంపాదించడం లేదనేగా మీకు అలుసు !"

"నువ్వు ఒట్టి ఇడియట్‌వి."

"అదిగో, అదే – "

"అంటే నిజంగా యిడియట్‌వనా ! నిన్ను నేను అలా భావిస్తే నేనే ఒక పెద్ద ఇడియట్‌ని అవుతాను !"

"మరి మాటిమాటికీ ఎందుకలా అనడం ?"

"నాకు చిరాకుగా వుంటుంది ! ఆఫీసులో ఏవేవో గొడవలు వుంటాయి! వాటితో నా మనసంతా పాడవుతుంది ! నేను కాస్త తిట్టగానే నువ్వు ఎందుకు ముఖం మాడ్చుకోవాలి ? నేను నీకు చీరెలు కొనడం లేదా ? నగలు చేయించడం లేదా ? నీ పుస్తకాలకి నాకెంత ఖర్చు అవుతుంది చెప్పు ?"

"అదుగో – "

"సరే సరే ! పుస్తకాల మాట ఎత్తను !"

"నగలు, చీరెలుయిస్తే సరి పోతుందా ? భార్యని విలువగా చూడ నవసరంలేదా !"

"విలువగా చూడటం అంటే యింకేం చేయాలి ?"

"మర్యాదగా మాట్లాడాలి."

"పరాయివాళ్లతో మాట్లాడినట్టన్న మాట ! అయితే యిక భార్య అంటే వున్న ప్రత్యేక చనువు ఏమిటి ?"

"చనువు అంటే తిట్లా ?"

"అవి తిట్లా !"

"ఆనందూ ! నేను లోపలికి రావచ్చునా ?" లాయరుగారి కేక విని

పించింది. లక్ష్మి మెల్లగా భర్త చేతుల్ని విడిపించుకుంది.

"ఏమైంది, మీ యిద్దరి మధ్యా అభిప్రాయ భేదం ఎందుకు వచ్చిందో కారణం తెలిసిందా ?" ఆయన వచ్చి తన కుర్చీలో కూర్చుంటూ అడిగారు.

"నేను ఈవిడగారిని తిడతానుట ! అసలు పెళ్ళి అవగానే మేము వుద్యోగ రీత్యా యిక్కడ విడి కాపురం పెట్టు కోవటంతో నా విలువ బొత్తిగా తెలియ కుండా పోయింది ! కొద్దిరోజులు మా అమ్మా, నాన్నల దగ్గర వుండా ల్సింది. మా నాన్న మా అమ్మని తిట్టే తిట్లు వింటే ! తిట్టినంతమాత్రాన ప్రేమ లేనట్టేనా !"

"అలాంటి ప్రేమ నాకు అవసరం లేదు !"

"మా అన్నయ్య యింకో అమ్మాయిని పెట్టుకున్నాడు. ఎప్పుడూ అక్కడే వుంటాడు ! కానీ మా వదినె ఏమీ అనదు."

"అలాంటి మొగుడిని నేను క్షణం కూడా భరించను !"

"మా బావ ఉన్నాడు. గుఱ్ఱపు పందేల్లో ఆడి సర్వస్వం నాశనం చేసు కున్నాడు."

"అలాంటి భర్తని మార్చుకోకపోతే, నేనెప్పుడో వదిలేసేదాన్ని !"

"వినండి ఆ మాటలు ! తను ఆ ఆడవాళ్లందరికంటే గొప్పదాన్ని అను కుంటుందేకానీ, నేను ఆ మగవా ళ్ళందరికంటే మంచివాడినని ఒప్పుకోదు."

"లాయరుగారూ ! ఆ మంచితనం ఒప్పుకుంటాను ! కానీ ఆ నోటి దురుసు తనం భరించలేనండి ! నాకు చాలా బాధగా వుంటుంది."

"మీరిద్దరూ తర్కం ఆపి యిలా కూర్చోండి."



ఆయన తన ముందున్న కుర్చీలు చూపించారు.

ఇద్దరూ వాటిల్లో కూర్చున్నారు.

"నేను మీకంటే పెద్దవాడిగా, వృత్తి రీత్యా ప్రపంచం చూసిన అనుభవ శాలిగా మీకు రెండుమాటలు చెపుతాను. అవి విన్నతర్వాత, మీరు మంచి చెడులు ఆలోచించుకుని, మీ భవిష్యత్తు నిర్ణయం చేసుకుందురుగాని. మీకు మీ మీ వ్యక్తిత్వాల్లో ఒక అభిప్రాయ భేదం వుంది. అదే యింట్లోంచి లక్ష్మి వెళ్ళిపోవటానికి కారణం అయింది." ఆనంద్ ఏదో చెప్పబోతుంటే ఆయన వారించారు.

నేను చెప్పేది సాంతం విను ! మీ యిద్దరూ వున్నారు. మీరు పెళ్ళి చేసు కున్నారు ! పిల్లలు పుట్టారు ! మీ సంసారం సుఖంగానే వుంది ! మీకు వచ్చిన బాధల్లా, ఒకరిపట్ల ఒకరికి మన్నన లేకపోవటం. ఆనందూ ! లక్ష్మి వుంది ! ఆమె నీ భార్య ! కాని యిది వరకటి తరంలాటి, అంటే మీ అమ్మ తరంలాటి మనిషి కాదు ! కాస్తో కూస్తో చదువుకుంది. ఇల్లు దిద్దుకునే నేర్పు ఉంది ! పిల్లల్ని క్రమశిక్షణతో పెంచే తెలివితేటలు వున్నాయి ! ఇంటెడు చాకిరీ చేస్తుంది ! భార్యగా తన బాధ్యత లేవో తెలిసినట్టే, భర్త దగ్గరనుంచి తను పొందాల్సిన అనురాగం, అర్హత, అధికారం కూడా ఆమెకి తెలుసు !

మీ అమ్మతరంవాళ్లు "మొగుడంటే మహారాజు అనుకునేవాళ్లు.

నీ భార్య తరం అలాకాదు. 'మొగుడంటే మొగుడే ! దిగివచ్చిన దేవుడేం కాదు' అనుకుంటారు. నువ్వు ఆఫీసు నుండి వచ్చేసరికి యింటి పనంతా చేసి, మడత నలగని చీర కట్టుకుని, జుట్టు చెదరనట్టుగా, జడ వేసుకుని పూలు పెట్టుకుని, కడిగిన ముత్యంలా నీ కోసం ఎదురుచూస్తూ వుంటుందనుకో ! ఆఫీసులో విసిగి వేసారిపోయిన నీ కళ్ళకి ఆమె పని లేనట్టుగా, జీవితం సుఖంగా ఎంజాయ్ చేస్తున్నట్టుగా అనిపిస్తుంది ! సంసార భారం నా ఒక్కడి భుజాలమీదనే నున్నట్టుగా, నువ్వేదో కష్టపడుతున్నావనే భావన వచ్చి, ఆ చిరాకు రెట్టింపు అనిపిస్తుంది ! అప్పుడు మీ చిరాకుచూసి ఆవిడ ఏమనుకుంటుంది. ఛీ! యిదేమిటి? ఈ విదిలింపుల కోసమా నేను యీయన రాక కోసం ఎదురు చూసింది అన్న భావం వస్తుంది ! నువ్వు ఆవిడకినగలు, చీరెలు యిస్తున్నావంటున్నావు. అందులో గొప్పతనం ఏమీ లేదు. ఆవిడ ఎంత పని చేస్తోంది? నువ్వు ఏ సాయంత్రమో వచ్చి అప్పుడప్పుడు ఏదయినా స్వీట్ కావాలని అంటే, చేసిపెడుతుందా లేదా ! ఇకపోతే పుస్తకాలు ! నువ్వు వాటికి డబ్బు ఖర్చయిపోతుందని బాధపడకు ! నువ్వు ఉదయం వెళ్ళిపోయి, సాయంత్రంగాని రావు ! పిల్లలు స్కూలుకి వెళ్ళిపోతారు. ఆవిడకి యిక కాలక్షేపం ఏముంది?పుస్తకాలేగా ! లేకపోతే వైరు బుట్టలో, పూసల బాగ్ లో అల్లడం ! ఆమె క్లబ్ లకి వెళ్ళదు ! హోటళ్ళకి తిరగదు. అలాటి అలవాట్లున్న భార్యల ఖర్చుల ముందు యివి ఖర్చులే కాదు ! ఆవిడకి అభిమానం ఎక్కువ ! గుర్తించడం నువ్వు నేర్చుకోవాలి, చెప్పానుగా. ఇప్పటి ఆడపిల్లల వ్యక్తిత్వాలే వేరని ! నేను మన ఆడపిల్లలని చాలామందిని చూస్తున్నాను. నూటికి 99 మంది తెలివిగల వాళ్ళు ! సంసారంచక్కగా చేసుకుంటారు! వాళ్ళ సుఖాలని గురించిన తెలివితేటలు కూడా వాళ్ళకి ఎక్కువే ! ఇదివరకు వాళ్ళలా స్త్రీ జీవితం అంటే భర్త పంచనే పడి వుండాలి అనే మూఢ నమ్మకాలు వాళ్ళకి లేవు ! భర్త కాదన్నా బ్రతకగలం అనే ధైర్యం వుంది ! ఇప్పటి చదువులు, అవకాశాలు అలాటివి! దానికి మనం బాధపడి ప్రయోజనం లేదు ! నువ్వు నీ భార్య చేస్తున్న పనికే, పని మనిషిని పెట్టుకుంటే, ఆ పని ఖరీదు ఎంతో క్షణంలో తెలుస్తుంది. నీ భార్య కూడా నీలాటి వ్యక్తిత్వం గలదని గుర్తించడం నేర్చుకో ! ఆఫీసులో నువ్వెంత చాకిరీ చేస్తున్నావో యింట్లో ఆమె కూడా అంత పనిచేస్తోందని తెలుసుకో ! నువ్వు ఆఫీసులో చిరాకు పడితే, ఆవిడ పిల్లల్తో, పనిమనిషితో పాలవాళ్ళతో చికాకులు భరిస్తుంది!"

ఆనందు వింటూ కూర్చున్నాడు.

లాయరుగారు, లక్ష్మివైపు తిరిగారు. "లక్ష్మీ ! నువ్వు కూడా కొన్ని నేర్చుకోవాలి ! మగవాళ్ళకి యిదివరకుకంటే జీవితంలో యిప్పుడు సమస్యలు ఎక్కువైనాయి ! ఉదయం లేచినప్పటినుంచి, దేనికోదానికి అతనికి వర్రీ వుంటూనే వుంటుంది. ముఖ్యంగా యీ సిటీజీవితాల్లో మనిషిని ఆదుర్దా అనేది భూతంలా పీక్కుతినేస్తుంది ! మీ ఆయన వున్నాడు. అతను వుదయం లేచినప్పటునుంచి ఆఫీసుకి వెళ్ళటానికి తొందరే కదా ! నువ్వు రుచిగా భోజనం తయారుచేసినా, అది ఆనందంగా, తీరుబడిగా అరగించే టైమే అతనికి వుండదు! ఆదరాబాదరా ఆ పనేదో త్వరగా ముగిసిపోవాలి అన్నట్టు తింటాడుగానీ దాని రుచి ఏమిటో గమనించే టైమే వుండదు. బస్సు అందుతుందో లేదోననే భయం !

సాయంత్రం అతను తిరిగి వచ్చేసరికి అతనిలో వున్న కాస్తో కూస్తో ఓపిక, ఆనందం అంతా ఆఫీసు పీల్చి పిప్పిచేసేస్తుంది ! అలసటలో వున్న మనిషిగా, త్వరగా చిరాకు వస్తుంది ! అతను నోటి దురుసుగా ఏదయినా అంటే, అప్పటికి నువ్వు వూరుకోవటం వుత్తమం ! అతను కాస్త విశ్రాంతిగా వున్నప్పుడు నువు అతన్ని నిలదీస్తే, అతనే నీకు వెంటనే క్షమార్పణ చెబుతాడు ! అతన్ని లాలించటం, సేదదీర్చటం నేర్చుకోవాలి నువ్వు ; ఈరోజుల్లో అందరకీ జీవితం అంతా సమస్యల మయం ! ఆదుర్దా ఆందోళనలతో నిండి వుంది !

పరస్పర అవగాహనతో, దీన్ని సాధ్యమైనంత తగ్గించుకుని సుఖంగా, శాంతంగా వుండటం నేర్చుకోవాలి ! మీ యిద్దరి మధ్యా అనురాగతోరణం వుండాలి ! నువ్వు అతని దగ్గర నుంచి వచ్చేసావు ! వచ్చి ఏం చేస్తావు ! ఏదో ఒక వుద్యోగం చూసుకుంటావు. అంతేగా ! ఆ వుద్యోగం సుఖంగా వుంటుందా ! దాంట్లో మాత్రం బాదరబందీలే వుండదంటావా. నీ పిల్లల భవిష్యత్తు ఏమిటి ? ఇవన్నీ నువ్వు ఆలోచించుకున్నావా ? అలాగని, అతనికి ఒదిగి వుండమని నేనటంలేదు ! ఎక్కడైనా వుండే సమస్యలు వుంటూనే వుంటాయి. మనకి ఏది లాభమో చూసుకోవాలి. ఏమంటావు ?"

లక్ష్మి నిజమే నన్నట్టు తల వూపింది.

లాయరుగారు యిద్దరి వంకా చూసారు.

"ఇప్పుడు చెప్పండి. మీరు డైవర్స్ తీసుకుంటారా ?"

"నాకు అవసరంలేదు ! ఆవిడకి

కావాలంటే నాకేం అభ్యంతరం లేదు," అన్నాడు వివేకానంద.

"నేనేం కావాలని కోరుకోటం లేదు." ముక్కు చీదుతూ అంది.

"అయితే నీ భర్త యింటికి వెళ్తావా ?"

"రమ్మంటే వెళ్తాను."

"నేను చచ్చినా రమ్మన మనను ! నేనేం ఆవిడని వెళ్ళిపొమ్మని అనలేదే !" వివేకానంద కుర్చీలోంచి లేచాడు.

లక్ష్మి రోషంగా చూసింది.

అతను ఖచ్చితంగా అన్నాడు.

"నేను మళ్ళీ చెబుతున్నాను. నేను రమ్మనమని అడగనే అడగను ! ఆవిడే వెళ్ళిపోయింది ! నేను, నాయిల్లు, నా పిల్లలు కావాలని అనుకుంటే యింటికి రమ్మనమండి."

"లాయరుగారు. నేను వెళ్తాను. కానీ యికనుంచి పనీపాటా లేదు అంటే మాత్రం వూరుకోను.అనొద్దనిచెప్పండి."


"బాగుంది. అది నాకు అలవాటయిన మాట !"

"అది చాలా దురలవాటు అని చెప్పండి."

"కావచ్చు ! నాకున్నది ఒకే ఒక దురలవాటు."

లాయరుగారు కల్పించుకున్నారు.

"ఆనందూ ! ఎ దురులవాటయినా పనిష్మెంటు వుంటే అదే పోతుంది !"




" నా యీ దురలవాటుకి ఏ పనిష్మెంటో చెప్పండి."

"నువ్వు ఆ మాట అన్నప్పుడల్లా ఆవిడకి ఒక కొత్త చీర కొనివ్వాలి ! ఏం లక్ష్మి ?"

లక్ష్మి కళ్ళు మెరిసినాయి." అవును! ఒట్టిదికాదు. వెంకటగిరి జరీ చీర ! అలా అయితే, నేను రాజీపడి యింటికి వెళ్తాను."

"మై గాడ్ ! అయితే, నా జీతం ఒక్క రోజులో అయిపోతుంది."

"కొత్తలో కాస్త బాధగా వుంటుంది. తర్వాత, నువ్వే ఆ మాట అనటం మానేస్తావు." అన్నారాయన.

"దీనికంటె వురిశిక్ష నయం !" ఆనంద్ గొణుక్కున్నాడు.

"వెళ్తాను లాయగారు. ఆయన గనక అలా మాట నిలుబెట్టుకోకపోతే, నేను త్వరలోనే మీ దగ్గరకి వస్తాను."

లక్ష్మి లేచింది.

"వెళ్ళిరండి. ఆనందూ ! ఇదుగో డైవర్సు తీసుకుంటామని వచ్చిన వాళ్ళకి రాజీ కుదిరిస్తే యిది నా ఫీజు." లాయరుగారు అంకెవేసి చూపారు. స్నేహం స్నేహమే ! వృత్తి వృత్తే !" అన్నారు నవ్వుతూ. ఆనందు పర్సు తెరిచి డబ్బు యిచ్చాడు. అతనికి ఆ డబ్బు యిస్తుంటే కోపం వచ్చింది. 'తీరుబడిగా కూర్చుని పనీపాటాలేక-' లక్ష్మివైపు చూసి అనబోయిన మాట నాలికచివర ఆపేసాడు. వెంకటగిరి జరీ చీర కళ్ళముందు మెదిలి చెదిరిపోయింది.

